# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్, యూరోపియన్ యూనియన్ లు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించాయి.
- మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తిని భారత్ – ఈయూ ఎఫ్.టీ.ఏ. బలపరుస్తుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చెప్పారు.
- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి.
- దేశ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంలో డీ.ఆర్.డీ.ఓ. కీలక పాత్ర పోషించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

=========================

భారతదేశం, యూరోపియన్ యూనియన్ లు చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేశాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోని కోస్టా, యూరోపియన్ కమిషన్ (ఈయూ) అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ మధ్య న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం ఈ ఒప్పందంపై సంతకం చేశారు. వాణిజ్యం, భద్రత, రక్షణ భాగస్వామ్యం, విపత్తు నిర్వహణ, గ్రీన్ హైడ్రోజన్ రంగాలలో భారత్, యూరోపియన్ యూనియన్ లు మొత్తం ఏడు పరస్పర ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఇరు పక్షాల మధ్య సంబంధాలు మరింత బలపడి నూతన కొత్త శిఖరాలకు చేరుకుంటాయని చెప్పారు. ఈ ఒప్పందం ఇరువైపులా పెట్టుబడులను పెంచుతుందని, నూతన ఆవిష్కరణల భాగస్వామ్యాలను ఏర్పరుస్తుందన్నారు. భారత్‌కు 45 కోట్ల జనాభా ఉన్న ఐరోపా మార్కెట్ ఈ ఒప్పందంతో అందుబాటులోకి రానుందని చెప్పారు.

(వాయిస్ 25 సెకన్లు)

ఆ తరువాత జరిగిన ఇండియా ఈయూ బిజినెస్ ఫోరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... తాము ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన ఐరోపాతో భాగస్వామ్యాలను నెలకొల్పామని చెప్పారు. గత 10 సంవత్సరాలలో ఐరోపాతో తమ వ్యాపారం రెట్టింపై 180 బిలియన్ యూరోలకు చేరుకుందన్నారు. 6 వేల కంటే

ఎక్కువ యూరోపియన్ కంపెనీలు భారత్ లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. యూరోపియన్ యూనియన్‌లో భారతీయ పెట్టుబడులు దాదాపు 40 బిలియన్ యూరోలకు చేరుకున్నాయని నరేంద్ర మోదీ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం-యూరోపియన్ యూనియన్ ల మధ్య లోతైన భాగస్వామ్యాన్ని ఈరోజు కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) ప్రతిబింబిస్తోందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తిని ఈ ఒప్పందం బలపరుస్తుందని చెప్పారు. భారతదేశం-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన FTA గురించి వివరించేందుకు పీయూష్ గోయల్ ఈ సాయంత్రం న్యూ ఢిల్లీలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ఒప్పందం ప్రకారం యూరోపియన్ యూనియన్‌కు దాదాపు 99 శాతం భారతీయ ఎగుమతులు చేరుకుంటాయని చెప్పారు. ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశంలోని కార్మిక ఆధారిత రంగాల నుండి జరిగే ఎగుమతులకు భారీ ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో అఖిల పక్ష సమావేశాన్ని ఈరోజు నిర్వహించింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రాజ్యసభలో సభా నాయకుడు జె. పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్, న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ తో పాటూ ఇతర ఎన్డీఏ కూటమి పార్లమెంట్ సభ్యులు హాజరయ్యారు. విపక్షాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన జైరాం రమేష్, ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకే) నాయకుడు తిరుచి శివ, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు సాగరిక ఘోష్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాంగోపాల్ యాదవ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం కిరణ్ రిజిజు విలేఖరులతో మాట్లాడుతూ... రేపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. బడ్జెట్ సమావేశాల మొదటి భాగంలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత ఉభయ సభలలో బడ్జెట్‌పై చర్చ జరుగుతుందని వెల్లడించారు. ఈ సమావేశాలను సజావుగా నిర్వహించడానికి అన్ని పార్టీలు సహకరించాలని కిరణ్ రిజిజు కోరారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అధునాతన సాంకేతికతలను అభివృద్ధి చేయడం ద్వారా దేశ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంలో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) కీలక పాత్ర పోషించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో డీఆర్‌డీఓ శాస్త్రవేత్తల సన్మాన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు పాల్గొని ప్రసంగించారు. సాంకేతికత నిరంతరం అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో.. దేశ రక్షణ వ్యవస్థను పటిష్టం చేయడానికి ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకార వాతావరణం అత్యవసరమని చెప్పారు. స్వదేశీ వ్యవస్థలు భారతదేశపు కార్యాచరణ సంసిద్ధతను బలోపేతం చేస్తున్నాయని "ఆపరేషన్ సిందూర్" నిరూపించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సైన్యం డీఆర్‌డీఓ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించిందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్-2026ను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు వర్చువల్‌గా ప్రసంగించారు. ఇంధన రంగంలో అపారమైన అవకాశాలకు భారతదేశం నిలయమని ఈ సందర్భంగా ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేసే ఐదు అగ్రగామి దేశాలలో భారత్ ఒకటని అన్నారు. ఇంధన రంగంలో చర్చలు, కార్యాచరణ కోసం ఇండియా ఎనర్జీ వీక్ ఒక ప్రపంచ వేదికగా ఆవిర్భవించిందని చెప్పారు. ప్రస్తుతం చమురు శుద్ధి సామర్థ్యం పరంగా భారతదేశం ప్రపంచంలో రెండో స్థానంలో ఉందని, త్వరలోనే తొలి స్థానానికి చేరుకుంటుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పలు రాష్ట్రాలలో కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ఎదురయ్యే జాప్యాన్ని గుర్తించి ఆయా సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రగతి సమీక్షా సమావేశం నిలుస్తోంది. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగతి వేదికగా పూర్తి స్థాయి సమీక్షలు ప్రారంభించినప్పటి నుంచి అనేక ప్రాజెక్టులకు సంబంధించిన ఆలస్యాన్ని, అవాంతరాలను నివారిస్తూ... వాటి పరిపూర్తికి బాటలు వేస్తున్నారు. అందులో భాగంగా హర్యానా రాష్ట్రానికి చెందిన మౌలిక వసతుల ప్రాజెక్టుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

జాతీయ రాజధాని ప్రాంతానికి సమీపంలో ఉండటంతో హర్యానా భారతదేశ మౌలిక సదుపాయాల రంగంలో ఒక వ్యూహాత్మక స్థానాన్ని కలిగి ఉంది. అలాగే జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, సరుకు రవాణా కారిడార్లు, విద్యుత్ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ హబ్‌లకు ఇది ఒక కీలక కేంద్రంగా కొనసాగుతోంది. ప్రస్తుతం.. ప్రగతి మోనటరింగ్ గ్రూప్ కింద ఆ రాష్ట్రంలో 6.38 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో 112 ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్నారు. ఇందులో  94 వేల 153 కోట్ల రూపాయల మొత్తం పెట్టుబడితో 57 ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభించబడగా 5 లక్షల 44 వేల 129 కోట్ల రూపాయల పెట్టుబడితో కూడిన 55 ప్రాజెక్టులు ప్రస్తుతం అమలులో ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్-19 క్రికెట్ పురుషుల ప్రపంచ కప్‌లో భాగంగా బులవాయో వేదికగా భారత్, జింబాబ్వే జట్ల మధ్య వన్డే మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. జింబాబ్వేకు 353 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =